క్లుప్తంగా

ఇంత పెద్ద జంక్షన్‌లో ఒక ప్రజా మరుగుదొడ్డి లేదు



మేడికొండూరు: పారిశ్రామిక కేంద్రమైన పేరేచర్ల జంక్షన్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ జంక్షన్‌లో మరుగుదొడ్ల లేక మహిళా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట రహదారుల కూడలి కావడంతో కార్మికులు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. జంక్షన్‌లో బస్సుల కోసం వేచి ఉండేందుకు షెల్టర్ లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారుల విస్తరణ కార్యక్రమం చేపట్టారు. కానీ, ప్రజలకు, ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యం గురించి పూర్తిగా విస్మరించారు.

కార్మికుల సమస్యను పరిష్కరించండి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని పోరాట యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలోని ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె.ఆదినారాయణతో కలసి ఆయన ప్రారంభించారు. దీక్షా శిబిరంలో నవనీతం, శారద, రమణ, శారమ్మ, ధనమ్మ కూర్చున్నారు. ఆశీర్వాదం, అంకమ్మ, సూరి, సాంబయ్య, గురవయ్య, దుర్గాభవాని, ఇమాంబి, నాగేశ్వరరావు, సుబ్బారావు సంఘీభావం తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండలో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 91 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 44 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. వీరికి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తనీమా, బండ్ల పట్టాభి రామయ్య, స్థానిక మిత్ర బృందం సభ్యులు ధనేకుల హరిబాబు, కొలికపూడి రమేష్, షేక్ రఫి, తాయి శ్రీ హరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు అభినందన



తాడేపల్లిరూరల్: మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్, పద్మలత దంపతులు ఆదివారం మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిశారు. టీడీపీ సభ్యత్వ నమోదు 1.52 కోట్లకు చేరుకోవడంలో కృషి చేసిన మంత్రిని అభినందించారు. అనంతరం అన్నే చంద్రశేఖర్ దంపతులు వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాన్ని నారా లోకేష్‌కు అందజేశారు. టీడీపీ నాయకులు అన్నె నందకిషోర్, బోయపాటి రమేష్ పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కొలవరం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తమ సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూత

తెనాలిరూరల్: తెనాలి మారిస్‌పేటలోని రేపల్లె గేటు ఎదురు ఉన్న మద్రాసు గేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వేలైను పనుల కోసం సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు గేటును మూసి వస్తున్నామని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుని సహకరించాలని కోరారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

మంగళగిరి డివిజన్ పరిధిలో ప్రభుత్వ శాఖల విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్వహణకు సర్కార్ నుంచి సకాలంలో నిధులు విడుదల కావడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా బకాయిలు క్రమంగా పేరుకుపోతూ తడిసి మోపెడవుతున్నాయి.

- డిసెంబర్ నాటికి రూ.4.90కోట్ల బిల్లుల పెండింగ్
- పేరుకుపోతున్న ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు
- నిర్వహణ నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం
- సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించలేని వైనం
- మంగళగిరి డివిజన్‌లో పోలీస్ శాఖ బకాయి టాప్
- తర్వాతి స్థానాల్లో పీఆర్, విద్యా, రెవెన్యూ శాఖలు



మంగళగిరి విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి విద్యుత్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు డిసెంబర్ నాటికి రూ.4.90 కోట్లు. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు మూడు నెలలకోసారి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. నిధుల కొరత కారణంగా సకాలంలో ప్రభుత్వం విడుదలు చేయడం లేదు. దీంతో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి.

అంతంత మాత్రంగా నిధులు

మంగళగిరి డివిజన్ పరిధిలో ప్రధానంగా పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, మరికొన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు చెందిన విద్యుత్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు అంతంతమాత్రంగా వస్తుండడంతో వీధి దీపాలు, మంచినీటి పథకాలకూ బిల్లులు చెల్లించలేకున్నారు. ఇక రెవెన్యూ శాఖలో కూడా భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఆదాయం కూడా బాగానే వస్తోంది. అయినా ఈ శాఖ కూడా బకాయి భారీగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా పోలీస్ శాఖ మాత్రం బిల్లులు చెల్లించడం లేదు. కానీ, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ ఈ బకాయిల భారాన్ని తగ్గించుకునేందుకే ప్రీ పెయిడ్ మీటర్లను తీసుకువస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయడానికి సంసిద్ధమైంది. ఆ మీటర్లు పనిచేయడం మొదలైతే విద్యుత్ శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బెడద శాశ్వతంగా తొలిగిపోతుంది.



మంగళగిరి విద్యుత్ శాఖ కార్యాలయం

శాఖల వారీగా డిసెంబరు నాటికి బకాయిలు (రూ.ల్లో)

నెం.	డిపార్ట్‌మెంట్	బకాయిలు
1	వ్యవసాయ శాఖ	3,36,000
2	పశు సంవర్ధక శాఖ	25,000
3	బీసీ సంక్షేమ శాఖ	1,49,000
4	విద్యా శాఖ	53,35,000
5	పర్యావరణ, అటవీ, సైన్స్ శాఖ	45,000
6	ఫుడ్ అండ్ సివిల్ సప్లయీస్	0.00
7	ఫైనాన్స్ అండ్ ప్లానింగ్	0.00
8	జనరల్ అడ్మినిస్ట్రేషన్	10,97,000
9	ఆరోగ్య, వైద్య, కుటుంబ శాఖ	36,37,000
10	పోలీస్ శాఖ	1,15,21,000
11	గృహ నిర్మాణ శాఖ	79,000
12	ఇరిగేషన్ శాఖ	0.00
13	ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	3,97,000
14	ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ	7,23,000
15	లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్	0.00
16	న్యాయ శాఖ	55,000
17	మున్సిపల్ అడ్మిన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్	46,72,000
18	మైనార్టీ వెల్ఫేర్ శాఖ	2,25,000
19	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్	0.00
20	పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్	64,89,000
21	రెవిన్యూ శాఖ	36,13,000
22	సోషల్ వెల్ఫేర్	12,62,000
23	ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ డిపార్ట్‌మెంట్	2,16,000
24	ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్	6,75,000
25	యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం	1,000
26	లిఫ్ట్ ఇరిగేషన్ శాఖ	28,01,000
27	ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు	61,19,000
	మొత్తం	4,90,40,000

అమిత్ షా పర్యటనపై వామపక్షాల నిరసన

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ ఆదివారం సీపీఎం, సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిన బీజేపీ నాయకులకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సీపీఐ తాడేపల్లి ఏరియా కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీపీఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, కొట్టే కరుణాకరరావు, వై. బర్నబాస్, తాడేపల్లి పట్టణ సీపీఐ కార్యదర్శి తుడిమెళ్ల వెంకటయ్య, మానికొండ దాంగే తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో నిరసన

తాడేపల్లిరూరల్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఉండవల్లిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచి దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు, టి.బక్కిరెడ్డి, సీహెచ్ సుందరరావు, పి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ఫిరంగిపురం: మండలం కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. పార్టీ మండల కార్యదర్శి మస్తాన్ వలి మాట్లాడుతూ విజయవాడ పర్యటనకు వచ్చిన హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తిరిగి వెళ్లిపోవాలన్నారు. సీఐటీయూ నాయకులు అబ్రహాం, రామారావు, అశోక్, శామ్యూల్ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అవహేళనగా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్ షా అంబేడ్కర్ విగ్రహం కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షా గో బ్యాక్ అంటూ సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ప్రజాతంత్ర వాదులు నినాదాలు చేశారు. ఆత్మకూరు గ్రామంలో సాయిబాబా గుడివద్ద ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ మంగళగిరి కార్యదర్శి చిన్న తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ కార్యదర్శి సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడొద్దు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

వడ్డమాను(తాడికొండ): అధికార కూటమి పార్టీల నాయకుల బెదిరింపులు, కవ్వింపులకు భయపడొద్దని, అందరికీ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు భరోసానిచ్చారు. ఆదివారం మండలంలోని వడ్డమాను, వెంకటపాలెం గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి తమపై జరిగిన దాడులు, బెదిరింపులు, తప్పుడు ఫిర్యాదులతో కట్టించిన కేసులను నాయకులు సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లారు. అన్నింటిపై న్యాయ పోరాటం చేద్దామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వజ్రబాబు వారికి ధైర్యం చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే పునాదులని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, ఆరేపల్లి జోజి, పార్టీ మాజీ అధ్యక్షుడు గొట్టం వెంకట నరసింహారెడ్డి, వల్లంరెడ్డి సుధాకర్‌రెడ్డి, పెరికల పాములు, కార్యంశెట్టి వెంకటేశ్వరరావు, వనమా కేశవులు, బెజ్జం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. వెంకటపాలెంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నూరి జక్రయ్య, ముఖ్య నాయకులు బెజ్జం ప్రకాశరావు, అన్నూరి శ్యామ్, షేక్ నాగుల్ మీరా, లాలాది శేషగిరిరావు, మిట్టనోసుల డేవిడ్, పొన్నెం సురేష్ పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

యోగి వేమన సమాజానికి ఆదర్శం

దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: యోగి వేమన సమాజానికి ఎంతో ఆదర్శమని, ఆయన సూక్తులు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త, అఖిల భారత రెడ్ల సంక్షేమ సమాఖ్య, శ్రీశైలం సత్ర సమూహాలకు రాష్ట్ర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని కళ్ళం రత్తారెడ్డి తులసమ్మ సత్రంలో నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి వేమారెడ్డి మాట్లాడుతూ రెడ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమసమాజ స్థాపనకు ఎన్నో ఉద్యమాలు చేసి, ప్రాణ త్యాగం చేసిన చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి వారందరూ ప్రస్తుత కాలంలో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. మళ్లీ రెడ్ల జాతి కోసం కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దానికి ఒకటే మార్గమని, ఎంతో మంది పేద రెడ్ల పిల్లలకు విద్య నేర్పించి, ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలని కోరారు. ఏ జాతి అయినా అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమని వేమారెడ్డి స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం హటక్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి అవసరమైన నిధులను సేకరిస్తామని చెప్పారు. ఈ కమిటీ రాజకీయ పార్టీలకు అతీతంగా నడుస్తుందని ఆయన తెలిపారు. కళ్ళం రాజశేఖరరెడ్డి, గాదె నాగిరెడ్డి, భీమిరెడ్డి శివారెడ్డి, మేక పుల్లారెడ్డి, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ నవనీత్ కృష్ణారెడ్డి, బుర్రముక్కు రాజేష్‌రెడ్డి, కళ్లం అరవింద్ రెడ్డి, మేక అంజిరెడ్డి పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

బంగారు స్నేహం..ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 1974-75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పాఠశాల విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు. బాల్యం మధుర స్మృతులు నెమరువేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, గురువుల మందలింపులు తలచుకుంటూ వయసు మరచి చిన్న పిల్లల కేరింతలు కొట్టారు. ఇందుకు మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని డీబీఎస్ గార్డెన్ వేదికగా మారింది. రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల 1974–75విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 117 పూర్వ విద్యార్థులకు గాను 50 మంది హాజరయ్యారు. 27 మంది వివిధ కారణాలతో మరణించడంతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. తాము విద్యనభ్యసించిన పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవికి పూజలు చేశారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హృదయరాజును సన్మానించారు. పాఠశాలలో 1.75 లక్షలతో సైకిల్ స్టాండ్ నిర్మాణం చేపడతామని వారు హామీ ఇచ్చారు. అనంతరం డీబీఎస్ గార్డెన్‌లో వివిధ ఆటపాటలతో చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు వెలగపూడి బ్రహ్మాజీ, గడ్డిపాటి శంకరరావు, ముసునూరి సత్యనారాయణ, సూరపనేని నాగేశ్వరరావు, సుందరి కుమారి, మన్నవ రమేష్, దొడ్డా శ్రీనివాసరావు, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

పసుపు రైతుల ధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘం నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర: తెనాలిలో నేడు జరిగే అగ్నిబాధిత పసుపు రైతుల ధర్నాలో రైతులు వేల సంఖ్యల్లో పాల్గొని జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపరలో ఆదివారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభమ్ మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజీలో పసుపు కాలిపోయి నేటికి సంవత్సరం అయిందని, అయినా గానీ ఇన్సూరెన్స్ అధికారులు క్లెయిమ్‌లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. పసుపు రైతులకు మండలంలోని అందరు రైతులు అండగా ఉండి తెనాలిలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొమ్మారెడ్డి రంగారెడ్డి, బొంతు వెంకటరెడ్డి, అచ్యుత సురేష్, వంగా కోటిరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి, ఆరిగ బోసురెడ్డి, రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన నలుగురిపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన హరికృష్ణ మాజీ రైల్వే కాంట్రాక్టరు వద్ద పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ముగ్గురు యువకులు రైల్వే కేబుల్ వైరును చోరీ చేసేందుకు ప్రయత్నించగా హరికృష్ణ వారిని వెంబడించగా ముగ్గురు పరారయ్యారు. ఒకరిని పట్టుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించాడు. దీనిని మనసులో పెట్టుకున్న దాసరి చేతన్, దేవరపల్లి మణి, బాలాజీ, గోపీనాథ్ హరికృష్ణపై శనివారం దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

బెరుకుగా.. పడితే ఇక అంతేగా..!



మేడికొండూరు: స్థానిక పేరేచర్ల కూడలి నుంచి గుంటూరు మార్గంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్క గోడ కూలిపోయే దశలో ఉంది. కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఈ గోడ భాగాన్ని ఢీకొట్టింది. దెబ్బతిన్న గోడ భాగం పడిపోయేలా ఉంది. అప్పటి నుంచి అధికారులు దీని మరమ్మతులు విషయం విస్మరించారు. గుంటూరు నుంచి హైదరాబాదు, కర్నూలు వెళ్లే రెండు జాతీయ రహదారులు ఇటువైపే ఉండటంతో ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ ఫ్లైఓవర్ గోడ పక్కనే రోడ్డుపై వాహనదారులు, పాదచారులు అది ఎప్పుడు కూలుతుందోనని బెరుకుగా ప్రయాణిస్తున్నారు. బ్రిడ్జి మీద విద్యుత్ వెలుగులు లేవు. రాత్రిళ్లు ఏదైనా ప్రమాదం జరిగితే దాని తీవ్రత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి గోడ కూలక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంఘ సంస్కర్త వేమన



ఫిరంగిపురం: సంఘ సంస్కర్త, గొప్ప మానవతావాది యోగి వేమన అని ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ దీవి నరసింహదీక్షిత్ అన్నారు. మండలంలోని హౌస్ గణేష్ శివారులోని కొండవీటి రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాల ఆవరణలో ఆదివారం యోగి వేమన జయంతి నిర్వహించారు. యోగి వేమన విగ్రహానికి కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, బొడపాటి అంజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి రాజుల పాలనలో నివసించిన వేమన గొప్ప సాహితీవేత్త అని, అప్పటి కాలంలో ప్రజలు వారి స్థితిగతులు, సమాజంలోని దురాచారాలపై ప్రజలను మేల్కొనేలా పద్యాలు రాసాడని చెప్పారు. తన ఊరు కొండవీడు అని పశ్చిమ వీధిలో నివాసమున్నట్లు వేమన చాటి చెప్పాడన్నారు. ఈ కార్యక్రమంలో బి.బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం పశు వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజుకో గ్రామంలో శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. దూడలకు డీవార్మింగ్, పశువులకు వ్యాక్సినేషన్, జీవాలకు షీ పాక్స్ వ్యాక్సిన్లు వేయనున్నట్లు తెలిపారు.

తవ్విన గుంతే ప్రాణం తీస్తుంది..



బడేపురం(తాడికొండ): తాడికొండ – బడేపురం రహదారిలో మేరీ మాత విగ్రహం మలుపు వద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్ కోసం ఇటీవల గుంతలు తవ్వారు. అనంతరం ములుపులో గుంతను పూడ్చలేదు. సింగిల్ రోడ్డు ఆపై మలుపు కావడంతో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే పగలే గుంతలో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ముమ్మరంగా ఫ్లోరింగ్ పనులు



ఫిరంగిపురం: వేమవరం కోటి లింగాల క్షేత్రంలోని మహా కాళేశ్వరస్వామి ఆలయ ముఖ మండపం వద్ద ఫ్లోరింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 22న ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ముఖ మండపం, ధ్వజ స్తంభం వద్ద పాల రాతి ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు.